సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



కన్నతల్లే కడతేర్చింది

విలాసవంతమైన జీవితం గడిపేందుకు అడ్డుగా ఉందని కూతురిని కన్నతల్లే కడతేర్చి కిడ్నాప్ డ్రామా ఆడింది. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగుచూశాయి.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,620
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,593
3 శాతం జీఎస్టీతో	రూ.5,761
సవర (8 గ్రా)	రూ.46,088

గరిష్టం/కనిష్టం
36.6 /26.7

వాతావరణం

బుధవారం గాలిలో 69 శాతం తేమ ఉంది. గురువారం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



ఇఫ్తార్ సహర్
గురువారం (సా) శుక్రవారం (ఉ)
6.23 4.41

రంజాన్ వేళలు



నివాళి

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం నెల్లూరులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



భరోసా

వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో భాగంగా నెల్లూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వేదాయపాళేనికి చెందిన వెంకటేశ్వర్లుకు బుధవారం నగదు అందజేస్తున్న వలంటీర్ శ్రీలేఖ



ఆనందం

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా బుధవారం నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో పొదుపు మహిళలు తదితరులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

మీ ఆరోగ్యం.. మా బాధ్యత

పేద ప్రజల వైద్యానికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. నాడు–నేడులో భాగంగా ఆస్పత్రుల రూపురేఖలు మార్చేస్తోంది. డాక్టర్లు, సిబ్బంది నియామకం వేగంగా జరుగుతోంది. జిల్లా ఆస్పత్రుల్లో పేదలకు అధునాతన వైద్యం అందిస్తోంది. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఇటీవల బాల భవిత కేంద్రం, జాతీయ వయోవృద్ధుల ఆరోగ్య సంరక్షణ, ఎస్‌ఎన్‌సీయూ తదితర వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి.

- ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రిలో అధునాతన వైద్యం
- జిల్లాలో రెండో డైస్ కేంద్రం ఇక్కడే..
- శిశువులకు ప్రత్యేక వైద్యసేవలు
- ఇప్పటికే హాస్పిటల్‌కు మూడుసార్లు అవార్డులు



ఎస్‌ఎన్‌సీయూ విభాగంలో శిశువుకు వైద్యం చేస్తున్న వైద్యురాలు

ఆత్మకూరు: ఆత్మకూరు–నెల్లూరుపాళెం మార్గంలో ఉన్న 150 పడకల ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి ఆత్మకూరు నియోజకవర్గం నుంచే కాకుండా ఉదయగిరి, సీతారామపురం, వైఎస్సార్ జిల్లా మైదుకూరు, బద్వేల్, పోరుమామిళ్ల, ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతవాసులు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. ప్రతి సోమ, బుధవారాల్లో 500 మందికిపైగా, మిగిలిన రోజుల్లో 250 లోపు ఓపీ ఉంటుంది.

వారందరికీ..

జిల్లా కేంద్రమైన నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో డైస్ (డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్) కేంద్రం ఉంది. అప్పుడే పుట్టిన శిశువు మొదలు 18 ఏళ్లలోపు వయసు గల వారికి ఈ కేంద్రంలో వైద్యసేవలందిస్తారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లా బాలభవిత కేంద్రాన్ని హాస్పిటల్లో ఏర్పాటు చేయగా నూతన భవనాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గత వారం ప్రారంభించారు. గ్రహణ మొర్రి (పెదవి చీలి ఉండడం), గుండెలో రంధ్రం, కంటి లోపాలు, వినికిడి లోపాలు, ఊపిరితిత్తుల సమస్యలు తదితర రోగాలకు చిన్నారులకు వైద్య సదుపాయం అందుబాటులో ఉంది. 2డీ, ఎకోకార్డియా తదితరాలు ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్నాయి. ఇప్పటికే ఆస్పత్రిలో మెరుగైన మాతాశిశు సంరక్షణ వైద్యం అందుబాటులో ఉంది. నెలకు 35కిపైగా కాన్పులు జరుగుతున్నాయి.

మూడుసార్లు రాష్ట్రస్థాయి అవార్డులు

ఈ ఆస్పత్రికి 2018–19లో తొలిసారి, 2020–21, 2022–23 సంవత్సరాల్లో రాష్ట్రస్థాయి కాయకల్ప అవార్డులు వచ్చాయి.

అందుబాటులోకి ఎస్‌ఎన్‌సీయూ

రికార్డు స్థాయిలో కాన్పులు జరుగుతున్న ఈ ఆస్పత్రిలో ఎస్‌ఎన్‌సీయూ కేంద్రం ఏర్పాటైంది. నెలలు తక్కువగా పుట్టిన శిశువులను ఇంక్యుబేటర్‌లో ఉంచి ప్రత్యేక వైద్యసేవలు అందించడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రికి ఎస్‌ఎన్‌సీయూ కేంద్రం మంజూరు చేసింది. ఇదే హాస్పిటల్లో కాన్పులు జరిగిన వారికి ఈ సేవలు అందించేందుకు పది బెడ్లు ఉండగా, ఇతర ఆస్పతుల్లో ఇలాంటి సమస్యలతో పుట్టే వారి కోసం మరో పది బెడ్లు ఏర్పాటు చేయడం గమనార్హం.

మరో ఆక్సిజన్ ప్లాంట్

ఇప్పటికే హాస్పిటల్లో రెండు ఆక్సిజన్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఒకటి ప్రభుత్వం, మరొకటి కరోనా కాలంలో సినీ నటుడు సోనుసూద్ సహకారంతో ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా గత వారం 500 కేఎల్ సామర్థ్యంతో మరో ప్లాంట్‌ను పెట్టారు. ఇతర ప్రభుత్వాస్పత్రులకు ఇక్కడి నుంచి ఆక్సిజన్ సిలిండర్లు సరఫరా చేస్తుంటారు.

కంటి వైద్యం

జిల్లాస్థాయిలో ప్రతి గురువారం కంటి ఆపరేషన్లు (క్యాటరాక్ట్) జరుగుతున్నాయి. వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా ఇప్పటికే రెండు వేలకుపైగా ఆపరేషన్లు నిర్వహించారు. ఇటీవల ఓ దాత ఆస్పత్రి రోగులతోపాటు అవుట్ పేషెంట్లకు, సిబ్బందికి నిరంతర భోజన సౌకర్యం కల్పించడం మరో విశేషం.

హాస్పిటల్లో..	
వైద్యుల సంఖ్య	: 34 మంది
నర్సులు	: 42 మంది
పారామెడికల్ సిబ్బంది, వార్డు బాయ్స్, ఎఫ్ఎన్ఓలు :	30 మంది
గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఓపీ : 94 వేల మందికిపైగా..	



వయోవృద్ధుల విభాగంలో సేవలందిస్తున్న నర్స్

వృద్ధుల కోసం..

జాతీయ వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ (ఎన్‌సీడీ) కేంద్రం ఆస్పత్రిలో ప్రారంభం కావడం మరో విశేషం. 60 ఏళ్లు పైబడిన వృద్ధుల కోసం ప్రత్యేకంగా 15 బెడ్లతో ఈ విభాగం ఏర్పాటైంది. ఇద్దరు వైద్యులు, ఎనిమిది మంది సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలందిస్తున్నారు.



ఆత్మకూరు ఆస్పత్రిలో ప్రారంభమైన బాలభవిత భవనం



డైస్ కేంద్రంలో చిన్నారుల ఆటపాటలకు ప్రత్యేక ఏర్పాట్లు

డైస్ సెంటర్ వరం



అప్పుడే పుట్టిన శిశువులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. ఖరీదైన వైద్యం అందించలేని స్థితిలో ఉండే పేదలైన తల్లిదండ్రులకు ఆత్మకూరు డైస్ కేంద్రం వరంలాంటిది. ముగ్గురు వైద్యులతోపాటు సుశిక్షితులైన ఎనిమిది మంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

– డాక్టర్ వికార్ అహ్మద్

అవగాహన కల్పిస్తున్నాం



గ్రహణమొర్రితో పుట్టే చిన్నారులకు ఫీడింగ్ చేయడం తల్లులకు కష్టం. అలాంటి వారికి అవగాహన కల్పించి పిల్లలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. చిన్నారుల లోకం ప్రత్యేకంగా ఉంటుంది. వారికి ఆటపాటలతో కూడిన వాతావరణం ఆస్పత్రిలో కల్పించి వైద్య సేవలందించడం డైస్ ప్రత్యేకత.

– డాక్టర్ సి.సునీత, డెంటిస్ట్

మెరుగైన వైద్యసేవలు

ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో చిన్నారులకు, వృద్ధులకు వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక విభాగాలతో వార్డులు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రం తర్వాత ఆత్మకూరులో మాత్రమే డైస్ కేంద్రం అందుబాటులో ఉంది. జాతీయ ఆరోగ్యమిషన్ లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నాం.

– డాక్టర్ శేషారత్నం, సూపరింటెండెంట్, జిల్లా ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు

కనుల పండువగా రామయ్య రథోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో కొలువైన కోదండరామస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. సీతారాములు, లక్ష్మణుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువు దీర్చారు. స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనేక మంది రథంపై మిరియాలు, ఉప్పు చల్లారు. గుమ్మడికాయలు, టెంకాయలు కొట్టారు. దాతలు భక్తులకు అడుగడుగునా మజ్జిగ, తాగునీరు, అల్పాహారం అందజేశారు. రథాన్ని లాగేందుకు యువత పోటీ పడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు సీఐలు రామారావు, రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.



జనసందోహం నడుమ జరుగుతున్న రథోత్సవం, (ఇన్‌సెట్‌లో) సీతారాములు, లక్ష్మణుడు

‘ఓపెన్’ బేరాలు

- ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం
- పాస్ గ్యారెంటీ పేరుతో అభ్యాసకుల నుంచి వసూళ్లు
- పరీక్షకు రాకుంటే రూ.30 వేలు, వస్తే రూ.15 వేలు?

నెల్లూరు(టౌన్): ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అభ్యాసకుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

జిల్లాలో..

ఈ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 17వ తేదీ వరకు ఇవి జరుగుతాయి. ఎస్‌ఎస్‌సీకి సంబంధించి 1,208 అభ్యాసకులకు ఆరు సెంటర్లు, ఇంటర్‌కు సంబంధించి 3,090 మంది అభ్యాసకులకు 16 సెంటర్లను ఏర్పాటు చేశారు.

విద్యార్హత కోసం..

జిల్లా పరిధిలో ఎస్‌ఎస్‌సీకి సంబంధించి 49, ఇంటర్‌కు సంబంధించి 51 అక్రిడిటేషన్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్లు (ఏఐ) ఉన్నాయి. వీటిల్లో తరగతులు నిర్వహిస్తుంటారు. రెగ్యులర్ స్కూల్స్‌కు వెళ్లేందుకు ఇబ్బందులున్నవారు ఓపెన్ స్కూల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. అదే విధంగా పదోన్నతులు, బ్యాక్‌లాగ్, కారుణ్య నియామకాల కోసం విద్యార్హత తప్పనిసరిగా ఉండాలి. దీనిని ఆసరాగా తీసుకుంటున్న ఏఐ సెంటర్ల నిర్వాహకులు పరీక్షల సమయంలో ఓపెన్‌గా బేరాలకు దిగుతున్నట్లు విమర్శలున్నాయి. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయాలంటే రూ.30 వేలు, స్వయంగా పరీక్షకు హాజరైతే రూ.15 వేలు ఇవ్వాలని అడ్మిషన్ల సమయంలోనే అభ్యాసకులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారని చెబుతున్నారు. ఏ విధానంలోనైనా పాస్ గ్యారెంటీ హామీ ఇస్తున్నారు. దీంతోపాటు పరీక్ష ఫీజు సమయంలో ఒక్కో అభ్యాసకుడి నుంచి అదనంగా రూ.2 వేలు వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. గతంలో ఇక్కడ డీఈఓగా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఈ విషయంలో చక్రం తిప్పుతున్నట్లు తెలిసింది.

ఎంత వసూలంటే..

పరీక్షల నేపథ్యంలో ఒక్కో సెంటర్ నుంచి రూ.లక్ష వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇందులో కావలిలో ఉన్న ఓ సెంటర్ నిర్వాహకుడు కీలకపాత్ర పోషించినట్లు తెలిసింది. ఈ మొత్తాన్ని విద్యాశాఖ అధికారులకు ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతోపాటు ఇన్విజిలేటర్ల నియామకం కోసం అనుకూలంగా ఉండేవారి పేర్లను విద్యాశాఖ అధికారులకు ఇవ్వగా.. వారినే నియమించినట్లు చెబుతున్నారు. 2017లో ఓపెన్ స్కూల్ పరీక్షల సమయంలో కందుకూరు, కలిగిరి తదితర ప్రాంతాల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాస్తుండగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక స్క్వాడ్ బృందం గుర్తించింది. అభ్యాసకులను డిబార్ చేశారు. ఇన్విజిలేటర్లపై కేసులు నమోదు చేశారు. మరికొన్ని చోట్ల ఇలాగే జరిగింది. ఈ విద్యా సంవత్సరంలో పరీక్షలు మొదలైన తొలిరోజే యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

పరీక్షలు పక్కాగా నిర్వహిస్తాం

ఓపెన్ స్కూల్ పరీక్షలను పక్కాగా నిర్వహిస్తున్నాం. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశాం. ఎక్కడైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పరీక్షలకు సంబంధించి కొంతమందిని మార్చాం.

– గంగాభవాని, డీఈఓ

108లో ప్రసవం



బిడ్డను అప్పగిస్తున్న ఈఎంటీ

- తల్లీబిడ్డ క్షేమం

మనుబోలు: నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు అధికం కావడంతో వాహనంలోనే సిబ్బంది ప్రసవం చేయగా, ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ ఘటన మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగింది. వివరాలు.. మండలంలోని కుడితిపల్లి గ్రామానికి చెందిన వెంకటరమణమ్మకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. వారు ఇంటి వద్దకు చేరుకుని వెంకటరమణమ్మను అంబులెన్స్‌లో తరలిస్తుండగా బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో వాహనాన్ని నిలిపిన ఈఎంటీ ఉపేంద్ర వైద్యులతో మాట్లాడుతూ గర్భిణికి కాన్పు చేశాడు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణమ్మ బంధువులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్‌రీల్

15 నుంచి సముద్రంలో వేట నిషేధం



సముద్రంలో వేట చేస్తున్న దృశ్యం (ఫైల్)

ముత్తుకూరు: ఈనెల 15వ తేదీ నుంచి సముద్రంలో చేపల వేటను నిషేధిస్తున్నట్లు మత్స్య శాఖ అధికారులు బుధవారం తెలిపారు. చేపలు, రొయ్యలు సముద్రంలో గుడ్లు పెట్టి, పిల్లలు ఉత్పత్తి చేసే సీజన్ కావడంతో మరపడవలు, సోనా బోట్లు, ఫైబర్ బోట్ల ద్వారా వేటను జూన్ 14వ తేదీ వరకు నిషేధిస్తున్నామన్నారు. ఈ సమయంలో మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నందున మత్స్యకార భరోసా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోంది. వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.10,000 జమ చేస్తుంది. నిషేధం మొదలుకాగానే అధికారులు లబ్ధిదారుల వివరాలను సేకరించనున్నారు.

ట్రాఫిక్ పోలీసుల సంక్షేమమే లక్ష్యం

- ఎస్పీ విజయారావు



హ్యాట్స్, సన్‌గ్లాస్‌లు అందుకున్న ట్రాఫిక్ పోలీసులతో ఎస్పీ

నెల్లూరు సిటీ: ఎండ, వాన, దుమ్ము, ధూళిని లెక్కచేయకుండా నిరంతరం కష్టపడి పనిచేసే ట్రాఫిక్ పోలీసుల సంక్షేమమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టామని ఎస్పీ విజయారావు అన్నారు. ట్రాఫిక్ పోలీసులకు 150 హ్యాట్స్, 150 సన్‌గ్లాస్‌లు, 150 వాటర్ కూలర్స్‌ను ఎస్పీ బుధవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగిందని సిబ్బంది తగిన జాగ్రత్తలు పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధగా ఉండొద్దన్నారు. ఇటీవల ప్రముఖుల రాకపోకలు, పరీక్షలు, శోభాయాత్రలో ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారని అభినందించారు.

94.54 శాతం మందికి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా వేగంగా జరుగుతోంది. బుధవారం నాటికి 2,90,646 మందికి నగదు అందించగా 94.54 శాతం నమోదైంది. సెలవురోజు అయినా వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛన్లు ఇచ్చారు. పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా అక్కడికి వెళ్లి నగదు అందజేసి భరోసా కల్పించారు. పింఛన్ల పంపిణీలో రాపూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు మండలాలు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. 38 మండలాల్లో 90 శాతానికిపైగా నగదు పంపిణీ పూర్తయింది.

నేటి నుంచి జేఈఈ మెయిన్ రెండో విడత

నెల్లూరు(టౌన్): ఎన్ఐటీ, ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్ష గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ పరీక్ష ఈనెల 15వ తేదీ వరకు జరుగుతుంది. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతల్లో ఎగ్జామ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని గీతాంజలి, శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలు, అయాన్ సెంటర్, గూడూరులోని నారాయణ, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ తదితర కళాశాలలు సెంటర్లుగా ఉన్నాయి. మొత్తం 8 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రానికి గంటన్నర ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది. విద్యార్థులు తమ వెంట అడ్మిట్‌కార్డుతో పాటు ఫోటో గుర్తింపుకార్డును తీసుకెళ్లాలి.

నాడు అన్యాయం.. నేడు అభయం


సీఎం లేఖలను చూపుతున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


బిట్రగుంట : మహిళలకు ఆసరా మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- మహిళలను మోసం చేసిన ఘనుడు బాబు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : గత ప్రభుత్వంలో చంద్రబాబు మహిళలకు అన్యాయం చేస్తే, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో మహిళలకు అభయం ఇస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో రూరల్ నియోజకవర్గంలోని పొదుపు మహిళలకు రూ.16.93 కోట్ల మూడో విడత వైఎస్సార్ ఆసరా మెగా నమూనా చెక్కును ఎంపీ, రూరల్ సమన్వయకర్త ఆదాలతో కలిసి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు పొదుపు మహిళల బ్యాంక్ బకాయిలను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత వారిని మోసం చేసిన ఘను డు చంద్రబాబు అని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి వరుసగా మూడు సార్లు ఆసరా నగదును జమచేసినట్లు వివరించారు.

మహిళల అభ్యున్నతికి అనేక పథకాలు – ఎంపీ ఆదాల

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టారని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కోరారు.

వేడుకగా..

మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా తొలుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆసరా లేఖలను ఆవిష్కరించారు. మెప్మా వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కార్పొరేటర్‌లు సత్తార్, నాగరాజు, రామ్మోహన్, శ్రీనివాసులురెడ్డి, అవినాష్, రైల్వేబోర్డు మెంబర్ వెంకయ్య, నేతలు పెంచలరెడ్డి, సురేష్, సురేష్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాజేష్, ఏసు నాయుడు, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పి.రవి, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి

బిట్రగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 750 పొదుపు సంఘాలకు సంబంధించి 7,875 మంది మహిళలకు రూ.5.56 కోట్లకు సంబంధించి మెగా నమూనా చెక్కును ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారతపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పలు పథకాలు అమలు చేసినట్లు వివరించారు.

కన్నతల్లే కడతేర్చింది

- విలాస జీవితానికి ఆశపడి కుమార్తె ఉసురు తీసింది
- పాపను సర్వేపల్లి కాలువలో పడేసి, కిడ్నాప్ కథ అల్లిన వైనం

నెల్లూరు సిటీ : విలాసవంతమైన జీవితం గడిపేందుకు కన్నకూతురు అడ్డుగా ఉందని భావించిన ఓ కసాయి తల్లి ఆ చిన్నారిని కడతేర్చింది. అనంతరం కిడ్నాప్ డ్రామాకు తెరలేపింది. కాగా పోలీసుల విచారణలో అసలు నిజాలు బయటపడ్డాయి. ఈ మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి బుధవారం బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నగరంలోని గుర్రాలమడుగు సంఘంలో కలుపూటి మణికంఠ, అనూష దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి పెద్ద కూతురు కృతిక, చిన్న కుమార్తె లక్ష్మీ నిహారిక సంతానం. భర్త మణికంఠ రాపూరులో ఓ హోటల్‌ను నిర్వహిస్తున్నారు. అప్పుడప్పుడు నెల్లూరుకు వచ్చి భార్య, పిల్లలను చూసుకుని వెళ్తుండేవారు. అనూష నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. భర్త పలుమార్లు అనూషను రాపూరుకు రావాలని కోరినా, వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

విలాసవంతమైన జీవితం కోసం..

అనూష విలాసవంతమైన జీవితం గడపాలని కోరుకునేది. భర్త మణికంఠకు విడాకులు ఇచ్చేసి పెద్ద కుమార్తె కృతికను తండ్రి వద్ద వదిలేసి, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లి అక్కడ గడపాలని ఆశించింది. ఈ క్రమంలో ఏడాదిన్నర వయసున్న చిన్న కుమార్తె తనకు అడ్డుగా ఉందని భావించి చంపేయాలని నిర్ణయించుకుంది. తల్లిదండ్రులు వెంకటగిరికి వెళ్లిన సమయంలో ఈనెల 3వ తేదీ రాత్రి ఇంట్లో ఊయాలలో నిద్రిస్తున్న చిన్న కుమార్తె లక్ష్మీ నిహారికను ఇంటి వెనుక ఉన్న సర్వేపల్లి కాలువలో పడేసింది. మరుసటి రోజు ఏమీ తెలియనట్లు కిడ్నాప్ డ్రామాకు తెరతీసింది. ఊయాలలో నిద్రిస్తున్న కుమార్తెను కిడ్నాప్ చేశారంటూ రోదించింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపగా కన్నతల్లి చేసిన ఘాతుకం బయటపడింది. సర్వేపల్లి కాలువలో పడేసిన బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. నిందితురాలిని అరెస్ట్ చేశారు.

సోమశిలలో 53.776 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 53.776 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 362 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 1200 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.984 మీటర్ల నీటి మట్టం నమోదైంది. సగటున 330 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

క్లుప్తంగా

1,243 పొగాకు బేళ్ల విక్రయం


వేలంలో విక్రయించిన పొగాకు బేళ్లు

మర్రిపాడు : మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 760 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 785 బేళ్లు రాగా వాటిలో 760 బేళ్లను విక్రయించామని వివరించారు. మిగిలిన 25 బేళ్లలో 15 నోసేల్, 9 నోబిడ్, 1 సీఆర్‌గా గుర్తించామన్నారు. వేలంలో 1,05,028 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.2,06,77,249ల వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కటింటికి రూ.200లు కాగా కనిష్ట ధర రూ.183 లభించింది. మొత్తం మీద సగటు కిలో రూ.196.87గా నమోదైంది. వేలంలో ఎనిమిది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కలిగిరిలో..

కలిగిరి : కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం 483 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 526 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 483 బేళ్లను కొనుగోలు చేశారని, 43 బేళ్లను తిరస్కరించారని తెలియజేశారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.170, సగటున రూ.189.05 ధర లభించింది. వేలంలో ఆరు కంపెనీలు పాల్గొన్నాయి.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 118
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 192
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 214
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40

సంక్షేమం, అభివృద్ధిని వివరించాలి


'జగనన్నే మా భవిష్యత్తు : మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్


కోవూరు : మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అంటిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ప్రతిష్టాత్మకంగా 'జగనన్నే మా భవిష్యత్తు'
- ఎమ్మెల్యేలు అనిల్, ప్రసన్న వెల్లడి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : అన్నివర్గాలకు అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతామని నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. నగరంలోని విజయమహల్ గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో జగనన్నే మా భవిష్యత్తు : మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 7 నుంచి 20వ తేదీ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న పనులను వివరిస్తామన్నారు. గత టీడీపీ కాలంలో మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి రూ.5 కోట్లు కూడా వెచ్చించలేదన్నారు. తమ ప్రభుత్వంలో రూ.40 కోట్లను మున్సిపల్ పాఠశాలలకు ఖర్చు చేశామన్నారు. నగరంలో 25 పార్కులు నిర్మించామన్నారు. నెల్లూరులో శిథిలావస్థలో ఉన్న 8 అర్బన్ హెల్త్ సెంటర్లను పునర్నిర్మించడంతో పాటు అదనంగా మరో ఎనిమిది సెంటర్లను రూ.24 కోట్లతో ఏర్పాటు చేశామన్నారు. గతంలో నెల్లూరుకు నారాయణ రూ.115 కోట్ల అప్పు తీసుకొచ్చాడే తప్ప గ్రాంటు రూపంలో ఏమైనా తెచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు..

కోవూరు : ప్రజలకు మరింత చేరువయ్యేందుకు జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం ఉపయోగపడుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పడుగుపాడు గ్రామ పంచాయతీ ఈ కార్యక్రమానికి ఆయన బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వారి అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతిరోజు 30 నుంచి 50 ఇళ్లను సందర్శించాలన్నారు. కుటుంబ యజమాని అనుమతితో జగనన్న స్టిక్కర్‌ను అంటించి జగనన్న పాలనకు మద్దతు తెలిపేలా ఒక ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యాసిడ్ దాడిపై విచారణ

కలిగిరి : కలిగిరిలో జరిగిన యాసిడ్ దాడి ఘటనపై కావలి డీఎస్పీ వెంకటరమణ బుధవారం విచారణ జరిపారు. దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. కాగా బాధిత దంపతులైన గునపాటి నాగార్జున, రమాదేవితో స్థానిక శివాలయ పూజారి నాగేంద్రకు ఉన్న వివాదాల నేపథ్యంలో ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎస్పీ వెంట కలిగిరి సీఐ సాంబ శివరావు, ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆత్మకూరు : వ్యాపారాల్లో అప్పులపాలై ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆత్మకూరు మండలం కరటంపాడులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివశంకర్ రావు వివరాల మేరకు.. కరటంపాడు గ్రామానికి చెందిన మార్తు సుధాకర్ (59) పలు వ్యాపారాలు నిర్వహించి అప్పుల పాలయ్యాడు. హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడు సైతం సిమెంట్ వరల వ్యాపారం పెట్టి నష్టపోయాడు. దీనికితోడు ఇటీవల డీసీపల్లి గ్రామంలో సుధాకర్ నిర్వహిస్తున్న షామియానాల సప్లయర్స్ దుకాణం సైతం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఆర్థికంగా నష్టపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం గ్రామంలోని తన పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చాకిచర్లలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

- 11న ప్రారంభం

ఉలవపాడు : మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్‌లో ఈనెల 11వ తేదీ నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘ సభ్యులు బుధవారం తెలిపారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ.5 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.500 గా నిర్ణయించినట్లు తెలియజేశారు. ప్రో కబడ్డీ నిబంధనలతో పోటీలు జరుగుతాయన్నారు. 9వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 96188 84830, 99897 59605 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.